క్లుప్తంగా

ఘనంగా బసవేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



బసవేశ్వరుని పూజల్లో భక్తులు

రాయవరం: స్థానిక దేవాంగ బసవేశ్వరస్వామి ఆలయం చతుర్థ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో వేంచేసి యున్న ఆలయంలో బసవేశ్వరుడికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు కాలూరి సత్యనారాయణశర్మ ప్రత్యేక పూజలు చేశారు.

8న విశ్రాంత ఉద్యోగుల సమావేశం

మండపేట: ఈ నెల 8న విశ్రాంత ఉద్యోగుల సమావేశమనుందని రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవళ్ల సత్యనారాయణ, కార్యదర్శి పెంకే గోవిందరావు తెలిపారు. పట్టణంలోని శ్రీరామ హిందూ యూపీ పాఠశాలలో మధ్యాహ్నం 3 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని చెప్పారు. సమావేశంలో పీఆర్సీ, డీఆర్, కొత్త ఇన్‌కమ్ ట్యాక్స్, లైఫ్ సర్టిఫికెట్లు తదితర అంశాలపై చర్చ ఉంటుందన్నారు. సభ్యులంతా విధిగా హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయాలి



కపిలేశ్వరపురంలో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న వీఆర్వోలు

కపిలేశ్వరపురం: గ్రామ, వార్డు సచివాలయ రేషనలైజేషన్‌లో రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం ప్రభుత్వాన్ని కోరింది. ఆ మేరకు బుధవారం కపిలేశ్వరపురం తహసీల్దార్ చిన్నారావుకు సంఘం మండల కమిటీ తరపున వీఆర్వోలు వినతి పత్రాన్ని అందజేశారు. సంఘం గౌరవ అధ్యక్షుడు వై.రాజారత్నం, అధ్యక్షులు జి.ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ గ్రామ సచివాలయ ఉద్యోగులను మూడు విభాగాలుగా విభజించడాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు డీడీఓలుగా ఉండడం వల్ల వీఆర్వోలు, కార్యదర్శుల మధ్య పలు చోట్ల వివాదాలు తలెత్తుతాయన్నారు. ఈ నేపథ్యంలో వీఆర్వోల గ్రేడులు తొలగించి వారికి తహసీల్దార్ డీడీఓలుగా ఉండేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో 19 గ్రామాల వీఆర్వోలు పాల్గొన్నారు.

ముగిసిన పశువైద్య శిబిరాలు

కపిలేశ్వరపురం: పశు సంవర్ధక శాఖ ఆలమూరు సబ్ డివిజన్ పరిధిలో 36 ఉచిత పశువైద్య శిబిరాలను నిర్వహించారు. శిబిరాల వివరాలను సహాయ సంచాలకులు ఎల్.అనిత వివరించారు. కపిలేశ్వరపురం, ఆలమూరు మండాల్లో 36 శిబిరాలను నిర్వహించగా 914 మంది పాడి రైతులకు ప్రయోజనం కలిగిందన్నారు. 2,063 పశువులకు వైద్య సేవలందించారు. 285 పశువులకు చువుడు పరీక్షలు చేశారు. చువుడు కట్టని 535 పశువులకు సెమన్ అందించారు. 74 పశువులకు కృత్రిమ గర్భధారణ పరీక్షలు చేశారు. 656 పశువులకు నట్టల నివారణ మందులు అందజేశారు. 708 లేగ దూడలు, 1,304 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు ఇచ్చారు. 1,200 గొర్రెలు, మేకలకు మసూచి టీకాలు వేశారు. 553 కోళ్లకు కొక్కెర వ్యాధి టీకాలు వేసినట్టు ఏడీఏ అనిత తెలిపారు.

రైతుబజార్ ఆకస్మిక తనిఖీ

మండపేట: పట్టణంలోని గాంధీనగర్ వీధిలో ఉన్న రైతుబజార్‌ను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. బుధవారం ఉదయం ఆయన రైతు బజార్‌లోకి వెళ్లి కూరగాయల దుకాణాలను పరిశీలించారు. కూరగాయల ధరల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ధరల పట్టిక వివరాలను ఎప్పటికప్పుడు ప్రతి దుకాణం వద్ద నల్ల బోర్డుపై పొందుపరిచి వినియోగదారులకు కూరగాయల వివరాలు తెలియ పరచాలని ఎస్టేట్ ఆఫీసర్ బోళ్ల సతీష్‌కు సూచించారు. వినియోగదారులకు తాజా కూరగాయలు అందించాలని దుకాణదారులకు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జొన్నపల్లి సూర్యారావు, పిల్లా గణపతి, గడి రాంబాబు, కేఎస్ఎన్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అయినవిల్లి: ఎస్.మూలపాలెం గ్రామానికి ఓ రైతు అమలాపురంలోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. దీనికి సంబంధించి హెడ్ కానిస్టేబుల్ కె.గణేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఎస్.మూలపాలెం గ్రామానికి చెందిన రమణాతి బాల వెంకట్రావు (47) తన సొంత పొలంలో పురుగుమందు పిచికారీ చేసుకుంటున్నాడు. అయితే మంగళవారం తన వరి చేలో సొమ్మసిల్లి పడిపోయాడు. బంధువులు అతన్ని అమలాపురంలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స కోసం చేర్పించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి అమలాపురం కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. దీనిపై మృతుడి బంధువులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

సమయం లేదు రైతన్నా..



రామచంద్రపురం రూరల్ మండలంలో ఈ-క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ అధికారులు

- ఈ -క్రాప్ నమోదుకు ఫిబ్రవరి 15 చివరి తేదీ
- అన్నదాతకు అండ ఈ-కేవైసీ

రామచంద్రపురం రూరల్: ఆరుగాలం శ్రమించి పంటలు పండించే రైతులు ప్రభుత్వం అందించే రాయితీలు, విపత్తుల సమయంలో ప్రభుత్వ సాయం పొందాలంటే ఎంతో ముఖ్యమైన ఈ క్రాప్ నమోదును అశ్రద్ధ చేయకూడదని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం రబీ సీజన్‌లో వరి నాట్లు దాదాపు చివరి దశకు చేరుకున్నాయి. మరోవైపు ఈ-క్రాప్ నమోదు జరుగుతోంది. నమోదు ప్రక్రియకు ఈ నెల 15 చివరి తేదీ కావడంతో రైతులు త్వర పడాల్సిన అవసరం ఉంది.

నమోదు ఇలా..

రైతులు తాము పండిస్తున్న పంటల వివరాలను నమోదు చేసుకోవడానికి తమ గ్రామంలోని రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయ సహాయకులను సంప్రదించాలి. సాగు చేసే భూమి విస్తీర్ణం, సర్వే నెంబర్లు వ్యవసాయ సహాయకులకు అందిస్తే వారు క్షేత్రస్థాయికి వచ్చి వివరాలను సరి చేసుకుని వ్యవసాయ శాఖ పోర్టల్‌లో పంట వివరాలను నమోదు చేస్తారు.

నమోదు కాకుంటే..

రైతులు తాము పండించే పంట వివరాలను ఈ క్రాప్ నమోదు చేయించుకోకపోతే పంట చేతికొచ్చిన తరువాత ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధరకు అమ్ముకునే అవకాశం ఉండదు. పండించిన ధాన్యం అమ్ముకోవడానికి దళారుల చుట్టూ తిరగాల్సి వస్తుంది. పంట చేతికొచ్చే సమయాల్లో అప్పుడప్పుడు విపత్తులు సంభవించి పంట నష్టపోయే పరిస్థితులను రైతులు ఎదుర్కొంటూ ఉంటారు. అటువంటి విపత్తుల సమయాల్లో ఈ క్రాప్ నమోదు జరగకపోతే ప్రభుత్వం అందించే నష్ట పరిహారాలు అందవు. పంటల బీమా వర్తించదు.

	పంట విస్తీర్ణం (ఎకరాల్లో)	ఈ క్రాప్ నమోదు
రామచంద్రపురం	18,236	17,600
కె.గంగవరం	15,620	15,000
కాజులూరు	18,980	18,650
రాయవరం	14580	14580
మండపేట	15,200	15200
కపిలేశ్వరపురం	14,200	14200

నిబంధనల సడలింపు



"రైతులు ఈ పంట నమోదు చేయించుకోవడం ఎంత ముఖ్యమో అంతే ముఖ్యంగా ఈ కేవైసీ కూడా చేయించుకోవాలి. అప్పుడు మాత్రమే రైతులకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలు, రాయితీలు, నష్ట పరిహారాలు అందుతాయి. కౌలు రైతులకు గతంలో సాగు పత్రాలు ఇవ్వాలన్న నిబంధన ఉండేది. ప్రస్తుతం ఆ నిబంధనలు సడలించి క్షేత్ర స్థాయిలో వాస్తవ సాగుదారులను గుర్తించి వారి పేరున ఈ క్రాప్ నమోదుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది."

– ఎస్.సత్యప్రసాద్, మండల వ్యవసాయాధికారి, రామచంద్రపురం.

చిన్నారుల ఎదుగుదల పట్ల అవగాహన ఉండాలి



టేకి ఉన్నత పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు

కపిలేశ్వరపురం: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఎదుగుదల పట్ల తల్లిదండ్రులకు అవగాహన ఉండాలని ఐసీడీఎస్ మండపేట ప్రాజెక్ట్ అధికారి గజలక్ష్మి అన్నారు. టేకి 3 అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం కేంద్రం నిర్వహణ, చిన్నారుల సంరక్షణకు చేపట్టే కార్యక్రమాలపై తల్లులకు అవగాహన కల్పించారు. గజలక్ష్మి మాట్లాడుతూ పిల్లల పెరుగుదలపై ఎప్పటి కప్పుడు అంగన్‌వాడీలు పర్యవేక్షిస్తున్నారన్నారు. అనంతరం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు కిశోరి వికాశం కార్యక్రమం లక్ష్యాన్ని వివరించారు. లింగ వివక్ష, సంపూర్ణ ఆహారం, ఆరోగ్యం, నాణ్యమైన విద్య, వ్యక్తిగత పరిశుభ్రత, లైంగిక వేధింపుల నుంచి రక్షణ పొందే పద్ధతులను వివరించారు. సామాజిక బాధ్యతతో వ్యవహరిస్తామంటూ చిన్నారులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్లు ఐ.మాణిక్యం, పి.వెంకటలక్ష్మి, టీఓటీలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వాలు సహకరించాలి



కాకినాడ - కోటిపల్లి రహదారిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కాజులూరు: సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేస్తూ ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వాలు సహకరించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు కొండేపూడి శ్యాంబాబు కోరారు. ఈ నెల ఏడవ తేదీన ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరప తలపెట్టిన వేల గొంతులు, లక్ష డప్పులు కార్యక్రమానికి మద్దతుగా బుధవారం గొల్లపాలెంలో నాయకులు ర్యాలీ నిర్వహించారు. జిల్లాలోని పలు గ్రామాలకు చెందిన నాయకులు హాజరై గొల్లపాలెం గ్రామ వీధులలో కలియ దిరిగారు. తీన్‌మార్, గారడి, డప్పు వాయిద్యాలతో భారీ ఎత్తున బహిరంగ ప్రదర్శనలు నిర్వహించారు. ముందుగా ఎస్సీ పేటలోని అంబేడ్కర్, జగజ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఎమ్మార్పీఎస్ నేతలు మాట్లాడుతూ 30 ఏళ్లుగా మంద కృష్ణ మాదిగ తదితర నాయకుల నాయకత్వంలో మాదిగ, మాదిగ ఉప కులాలు చేస్తున్న పోరాటం ఫలితంగా సుప్రీంకోర్టు వర్గీకరణకు అనుకూలంగా తీర్పు నిచ్చిందన్నారు. పాలకులు స్పందించి వర్గీకరణ చేపట్టాలని లేని పక్షంలో రాష్ట్ర ప్రభుత్వాలకు తమ సత్తా ఏమిటో చూపిస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పలివెల సూరిబాబు, నాగేశ్వర్రావు, పలివెల ఇస్రయేల్‌రాజు, ఉందుర్తి బుజ్జి, జొన్నకూటి వెంకటేశ్వర్రావు, బొమ్ము రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

రామచంద్రపురం: నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ అపార్టీ అధిష్టానం బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామాలను పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది.

నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులు వీరే..

యూత్ వింగ్	మాదిరెడ్డి పృథ్వీరాజ్	గ్రీవెన్స్ సెల్	యనమదల శ్రీను
మహిళా విభాగం	యల్లమిల్లి సతీష్‌కుమారి	వాణిజ్యవిభాగం	యాళ్ల వెంకటరమణమూర్తి
రైతు విభాగం	సాగి వీరభద్రరాజు	వీవర్స్ వింగ్	ఉప్పు అర్ధనారీశ్వర బులిరాజు
బీసీ సెల్	పితాని సుబ్రహ్మణ్యం	వైఎస్ఆర్ టీయూసీ	దోనుపూడి శ్రీనివాసరావు
ఎస్సీ సెల్	గుబ్బల శ్రీనివాసరావు	అంగన్‌వాడీ వింగ్	మేడిశెట్టి పద్మావతి
ఎస్టీ సెల్	అమలుదాసు లోవరాజు	లీగల్‌సెల్ వింగ్	పాకలపాటి గోవిందరాజు
మైనార్టీ సెల్	మహ్మద్ సాదిక్ హుస్సేన్	కల్చరల్ వింగ్	అనుసూరి శ్రీనివాస్
క్రిస్టియన్ మైనార్టీ సెల్	బీర సతీష్‌చంద్ర	సోషల్ మీడియా వింగ్	పాటి వరప్రసాద్
స్టూడెంట్ వింగ్	గంపల నవీన్‌చంద్ర	ఐటీ వింగ్	వైట్ల శ్రీహరికృష్ణ
పంచాయతీరాజ్ వింగ్	పంపన సత్యానందం	దివ్యాంగుల విభాగం	లేవాటి వెంకటేశ్వరరావు
మున్సిపల్ వింగ్	పెంటపాటి దేవి	డాక్టర్స్ వింగ్	కొప్పిశెట్టి వీవీ సత్యనారాయణ
ఆర్‌టీఐ వింగ్	మట్టా ఉమామహేశ్వరరావు	ఇంటలెక్చువల్ ఫోరం	టీవీవీ రెడ్డి
వాలంటీర్ వింగ్	వరా శ్రీనివాసు	బూత్ కమిటీలు	చిల్లే నాగేశ్వరరావు
		పబ్లిసిటీ వింగ్	పోలినాటి వరప్రసాద్

కపిలేశ్వరపురం: మండపేట అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలపై నియమించిన అధ్యక్షుల జాబితాను బుధవారం విడుదల చేశారు. నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షులుగా చోడే శ్రీకృష్ణ, మహిళా విభాగం అధ్యక్షురాలుగా మేడిశెట్టి సత్యవేణి, రైతు విభాగం పుట్టా కృష్ణమూర్తి, బీసీ సెల్ పాలిక శ్రీను, ఎస్సీ సెల్ నక్కా సింహాచలం, ఎస్టీ సెల్ సమతం పాపారావు, క్రిస్టియన్ మైనారిటీ సెల్ చిక్కాల రాంబాబు, పచాయతీ రాజ్ విభాగం పసుమర్తి నాగేశ్వరరావు, సాంస్కృతిక విభాగం కొనగళ్ల ఏయూ భాస్కరరావు, వైద్యుల విభాగం గంగుమ రాంబాబు, మున్సిపల్ విభాగం పిల్లి శ్రీను, విద్యార్థి విభాగం అబ్బిరెడ్డి వీర్రాజు, ఆర్టీఐ విభాగం మందపల్లి రవి, వలంటీర్ల విభాగం తమ్మర్శి జగపతి, గ్రీవెన్స్ సెల్ పలివెల మధు, వాణిజ్య విభాగం పలుకూరి వెంకన్నబాబు, చేనేత విభాగం రుద్రాక్షుల వీవీ శ్రీనివాసరావు, వైఎస్ఆర్‌టీయూసీ శెట్టి నాగేశ్వరరావు, లీగల్‌సెల్ టపా వీర గోవిందరావు, ఐటీ విభాగం యరమాటి వెంకన్నబాబు, సోషల్ మీడియా విభాగం జొన్నపల్లి సత్తిబాబు, బూత్ కమిటీల విభాగం పోతుల వీవీఎస్‌డీ ప్రసాద్, పబ్లిసిటీ వింగ్ వంగా శ్రీనివాసరావులను నియమించారు.

శివారు భూములకు సాగునీరు అందించాలి

కాజులూరు: శివారు భూములకు సాగునీరు అందించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రైతు సంఘం నాయకులు పోలినాటి కృష్ణమూర్తి, పోలినాటి హనుమంతు, పెంకే సత్యనారాయణ తదితరులు డిమాండ్ చేస్తున్నారు. బుధవారం ఆర్యావటంలో మాట్లాడుతూ గోదావరి నదిలో తలెత్తిన నీటి ఎద్దడి నేపథ్యంలో తూర్పు డెల్టా కాలువ శివారు భూముల్లోని ఆర్యావటం శివార్లలో ఉన్న తుమ్మలపల్లిలంక, సిరిగలపల్లిలంక భూములకు తీవ్ర సాగునీటి ఎద్దడి ఏర్పడిందన్నారు. తమ పొలాలకు కరప మండలం వేలంగి తదితర గ్రామాల మీదుగా సాగునీరు రావాల్సి ఉందని అయితే ఎగువ ప్రాంతంలో రైతులు పంట కాలువలలో ఆయిల్ ఇంజన్లు వేసి నీరుతోడేస్తుండడంతో శివారు భూములకు చుక్కనీరు రావటం లేదన్నారు. అధికారులు సాగునీటి సరఫరాలో కాలువ శివారు భూములకు పొలాలకు ప్రాధాన్యమివ్వడంతో పాటు పంట కాలువలలో ఆయిల్ ఇంజన్లు వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

8న ద్రాక్షారామ భీమేశ్వరుని కల్యాణ మహోత్సవం

ఈఓ అల్లు వెంకట దుర్గాభవాని



భీమేశ్వరాలయ ప్రాంగణంలో మాట్లాడుతున్న ఈఓ దుర్గాభవాని

రామచంద్రపురం రూరల్: ఈ నెల 8న ద్రాక్షారామ మణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ, దేవాదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని బుధవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 8 నుంచి 14 వరకు ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామితో పాటు శ్రీ లక్ష్మీ సమేత నారాయణ స్వామి, చండికా సమేత సూర్యేశ్వరస్వామి వార్ల దివ్య కల్యాణ వేడుకలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 8న రాత్రి 11.05 గంటలకు స్వామి వార్ల దివ్య కల్యాణం, 9 న కల్యాణ మూర్తుల నగరోత్సవం, 10 న సదస్యం, 11న రథోత్సవం , 12న వసంతోత్సవం, 13న తెప్పోత్సవం, 14న శ్రీ పుష్పోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామి వార్ల కల్యాణ వేడుకలను తిలకించాలని కోరారు. కార్యక్రమంలో వేగాయమ్మపేట జమీందారు రాజావాడ్రేవు సుందర రత్నాకర శర్మ, ప్రధాన అర్చకులు కళ్లేపల్లి ఫణికుమార్, అర్చకులు జుత్తిక శ్రీకాంత్ శర్మ, జుత్తిక చిన్నా, కళ్లేపల్లి విశ్వప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సాగు, రవాణా తగ్గుముఖం

ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఐజీ అశోక్ కుమార్

రామచంద్రపురం: రాష్ట్రంలో గంజాయి సాగు, అక్రమ రవాణాలు బాగా తగ్గుముఖం పట్టాయని ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్ తెలిపారు. ఆయన బుధవారం రామచంద్రపురం పట్టణ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గంజాయి, మత్తు పదార్థాలపై ప్రభుత్వం ఈగల్ వ్యవస్థను ఏర్పాటు చేసిందన్నారు. దీనితో గంజాయి సాగు, అక్రమ రవాణాలు బాగా తగ్గుముఖం పట్టాయన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అదుపులోనే ఉందని తెలిపారు. గంజాయికి సంబంధించిన ఎటువంటి సమాచారం ఉన్నా ప్రజలు నిర్భయంగా టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేయాలని పిలుపునిచ్చారు. పాత నేరస్తులపై నిరంతర నిఘా ఉంటుందని హెచ్చరించారు. చిన్న పిల్లలు, మహిళలపై నేరాలు చేసే వారిపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు వెల్లడించారు. ప్రజల్లో అవగాహనా సదస్సుల ద్వారా చైతన్యం కలిగిస్తున్నట్లు తెలిపారు. సైబర్ క్రైమ్ పెరిగిన మాట వాస్తవమేనని అన్నారు. వీటిలో డబ్బులు పోగొట్టుకున్నవారు వీలైనంత త్వరగా(సంఘటన జరిగిన మూడు గంటలలోపు) 1930 నంబరుకు ఫోన్ చేస్తే డబ్బులు బదిలీ కాకుండా చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు.

సుజలమేదీ..?

తుప్పు పాలవుతున్న మార్కెటింగ్ శాఖ నిధులు



మరమ్మతులకు గురై మూలకు చేరిన వాటర్‌ప్లాంట్

మండపేట: ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే ఉద్దేశ్యంతో గత టీడీపీ ప్రభుత్వంలో సుజల ప్రవంతి పేరిట స్థానిక రైతుబజార్ ఆవరణలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఈ ప్లాంటు నిర్వహణ కోసం రైతు బజార్లోనే నీటి పంపు, మోటారుతో పాటు నీటిశుద్ధి యంత్రాలకు లక్షలాది రూపాయలు మార్కెటింగ్ శాఖ కేటాయించి అక్కడ నిర్మించింది. ప్లాంటు భద్రత కోసం ప్రత్యేకంగా రైతు బజార్ లోపల ఒక గదిని కూడా కేటాయించారు. దాన్ని అప్పట్లో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆధ్వర్యంలో అప్పటి వ్యవసాయ శాఖ మంత్రి మండపేట వచ్చి రైతులకు యంత్ర సామాగ్రిని అందించి, వాటర్ ప్లాంటును సైతం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో వాటర్ ప్లాంట్ గత కొన్ని నెలలుగా పని చేయడం మానేసింది. దీనితో ప్లాంట్ మూలన పడింది. ఈ వాటర్ ప్లాంటు ద్వారా అప్పట్లో 24, 25, 26, 27 వార్డుల ప్రజలు ప్లాస్టిక్ బాటిళ్లు నింపుకొని తాగునీరు తీసుకు వెళ్లేవారు. రైతు బజారుకు కూరగాయలు కొనుగోళ్లకు వచ్చే వినియోగదారులు, అక్కడ ఉన్న వ్యాపారులకు సైతం తాగునీరు పుష్కలంగా అందేది. కొన్ని నెలలుగా వాటర్ ప్లాంట్ పనిచేయనప్పటికీ ఎస్టేట్ ఆఫీసర్ బోళ్ల సతీష్ పట్టించుకోకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్లాంటు కోసం ఖర్చు పెట్టిన లక్షలాది రూపాయలు తుప్పు పాలవుతున్నాయని వినియోగదారులు అంటున్నారు. మరమ్మతులకు గురైన వాటర్ ప్లాంటును రిపేరు చేయించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ప్లాంటు లోపల నానారకాల చెత్త వేసి దాన్ని ఇంకా పని చేయకుండా చేశారు. వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకొని ఇప్పటికైనా ప్లాంట్ మరమ్మతులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని పలువురు కోరుతున్నారు. ఇదిలా ఉంటే ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు బుధవారం రైతు బజార్ తనిఖీకి వెళ్లారు. అక్కడ ఏమైనా సమస్యలున్నాయా అని అడగ్గా ఎస్టేట్ ఆఫీసర్ నోరు మెదపక పోవడాన్ని పలువురు బాహాటంగానే విమర్శిస్తున్నారు.

యాత్రాదర్శిని త్రిభాషా పుస్తకావిష్కరణ

సఖినేటిపల్లి: అంతర్వేది ఆలయంలో తొలిసారి తెలుగు, హిందీ, ఇంగ్లీషు భాషల్లో ప్రచురించిన అంతర్వేది యాత్ర దర్శిని పుస్తకాన్ని బుధవారం దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఆవిష్కరించారు. టెంపుల్ టూరిజం సిరీస్-1 పేరుతో వైభవ్ పబ్లిషర్స్ ఈ పుస్తకాన్ని ప్రచురించింది. పుస్తక రచయిత కేఎంకే రమేష్ మాట్లాడుతూ, భారతీయ దేవాలయాల చారిత్రక, పౌరాణిక ప్రాముఖ్యతలను ప్రపంచానికి చాటి చెప్పాలనే లక్ష్యంతో వీ ఫౌండేషన్ ద్వారా వైభవ్ పబ్లిషర్స్ ఈ బృహత్తర కార్యానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఏసీ సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రాంతీయ భాషతో పాటు, జాతీయ, అంతర్జాతీయ భాషల్లో అంతర్వేది క్షేత్ర విశేషాలను పొందు పరుస్తూ పుస్తక రూపంలో ప్రచురించడం అభినందనీయమన్నారు. హిందీ అనువాదకుడు డాక్టర్ చిట్టిల్ల నిర్మిలాదేవి, ఆంగ్ల అనువాదకుడు డాక్టర్ చెంగల్వ రామలక్ష్మి, ఆర్ట్ ఫొటోగ్రాఫర్ వి.శర్మ, ప్రధానార్చకుడు కిరణ్, సూపరింటెండెంట్ సారథి పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్టు

కొత్తపేట: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మద్యం బాటిళ్లు కలిగి ఉన్న ఒక వ్యక్తిని అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్సైజ్ దాడుల్లో భాగంగా మంగళవారం మండలంలోని వానపల్లి గ్రామానికి చెందిన పల్లి విజయకుమార్ వద్ద ఎనిమిది 180 ఎంఎల్ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు తెలిపారు. దాడుల్లో ఎస్సై కె.అన్నవరంపాల్గొన్నారు.

పీఆర్ డీఈగా సూర్యనారాయణ



డీఈఈ సూర్యనారాయణ

మండపేట: పంచాయతీ రాజ్ సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ఏవీ సూర్యనారాయణ నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు డీఈగా ఇక్కడ పని చేసిన రామ్ నారాయణ పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో కొత్తపేట పంచాయతీరాజ్ శాఖలో పని చేస్తున్న సూర్యనారాయణను ప్రభుత్వం ఇన్‌చార్జ్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం బాధ్యతలు స్వీకరించిన ఆయనను ఏఈ నాగేశ్వరరావు, సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిశారు.

తారు వేసేందుకు తీరిక లేదా!



వెదురుమూడి-సంధిపూడి రహదారి గుంతలపై చెదిరిన కంకరరాళ్లు

కపిలేశ్వరపురం: ఆలమూరు మండలంలోని వెదురుమూడి -సంధిపూడి గ్రామాల మధ్య సంక్రాంతికి ముందు రహదారి గుంతలను పూడ్చారు. రహదారులకు మహర్దశ అంటూ అధికార కూటమి నేతలు, కార్యకర్తలు సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం చేసుకున్నారు. సంక్రాంతి వచ్చి వెళ్లింది. గుంతల పూడిక పనులు మాత్రం అసంపూర్తిగానే మిగిలాయి. వెదురుమూడి-సంధిపూడి మధ్య పలు రహదారి గుంతల్లో వేసిన కంకరపై తారు పోర వేయకపోవడంతో కంకర చెదురు మదురుగా పైకి పేరుకు పోయింది. దీంతో ద్విచక్ర వాహనదారులు జారి పడుతున్నారు. కంకర మొనల కారణంగా ద్విచక్ర వాహనాల టైర్లకు పంక్చర్లు పడుతున్నాయి. ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. తారు పోర వేయాలని కోరుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

పంచాయతీ కార్మికుడు వెంకట్రావు మృతి

కపిలేశ్వరపురం: స్థానిక పంచాయతీ పారిశుధ్య కార్మికుడు కోరం వెంకట్రావు (61) బుధవారం ఆకస్మిక మృతి చెందారు. దీర్ఘకాలంగా గ్రామ పారిశుధ్య పరిరక్షణకు శ్రమించారు. ఆయన మృతికి సర్పంచ్ సాకా శ్రీనివాస్, కార్యదర్శి శివ చక్రవర్తి సంతాపం వెలిబుచ్చారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి



మృతి చెందిన వృద్ధురాలు కొత్తూరు రాజేశ్వరి

కాజులూరు: ఒంటికి నిప్పు అంటుకుని కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు కొత్తూరు రాజేశ్వరి(70) మృతి చెందినట్లు గొల్లపాలెం ఎస్సై మోహన్‌కుమార్ బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. వృద్ధురాలు కాజులూరు గ్రామంలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో తాటాకు ఇంటిలో నివాసం ఉండేది. ఈ క్రమంలో సోమవారం రాత్రి 9 గంటల సమయంలో విద్యుత్ నిలిచి పోవడంతో అగ్గిపెట్టెతో దీపం వెలిగించే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో చీరకు నిప్పు అంటుకోవడంతో 80 శాతం శరీరానికి కాలిన గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. బుధవారం సాయంత్రం 4 గంటలకు ఆమె మృతి చెందినట్లు ఆసుపత్రి వర్గాల సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

కమాండ్ కంట్రోల్ సిస్టం పరిశీలన



కంట్రోల్ సిస్టంను పరిశీలిస్తున్న ఆర్డీవో మాధవి

సఖినేటిపల్లి: అంతర్వేది క్షేత్రంలో లక్ష్మీనరసింహస్వామివారి తిరు కల్యాణ మహోత్సవాల్లో భక్తుల భద్రతకు నిర్దేశించిన సీసీ కెమెరాల వ్యవస్థను నడిపే కమాండ్ కంట్రోల్ సిస్టంను అమలాపురం ఆర్డీవో కె.మాధవి బుధవారం పరిశీలించారు. అంతర్వేది టూరిజం గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన ఈ సిస్టం ద్వారా తీర్థంలో ఆయా రద్దీ ప్రాంతాలలో పరిస్థితులు ఎప్పటికప్పుడు అంచనా వేసే విధానం, మైక్ అనౌన్స్‌మెంట్ విధానాలను ఆమె క్షుణ్ణంగా టెక్నీషియన్లతో చర్చించారు. తహసీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు, ఉత్సవ సేవా కమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ పాల్గొన్నారు.